విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 23, డిసెంబరు 2025

ఉపాధి హామీ పథకాన్ని క్రమబద్ధీకరణ చేయడం తగదు : సీపీఐ

విశాలాంధ్ర - నందికొట్కూరు : కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని క్రమబద్ధీకరణ చేయడం తగదని గ్రామీణ పేదలు ,కష్ట జీవుల ఉపాధిని దెబ్బ తీయ దానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రఘురామూర్తులు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. సోమవారం పట్టణంలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు ఉపాధి కూలీలతో కలిసి సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేందుకే మహాత్మా గాంధీ పేరు తొలగింపు అని ఇది జాతిపితను అవమానించడమేనని వారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి మహాత్మా గాంధీ పేరుని కొనసాగిం చాలని, మోడీ ప్రభుత్వం చట్టాలు, పథకాల పేర్ల మార్పుపై పెట్టే శ్రద్ధ దేశ ప్రగతిపై పెట్టాలని సూచించారు. పథకాల పేర్ల మార్పు వల్ల అనవసర ఖర్చు తప్ప ప్రయోజనం లేదనీ ఉపాధి హామీ చట్టం ద్వారా ఏళ్ల తరబడి వ్యవసాయ కూలీలు ,కష్ట జీవులు గ్రామీణ కార్మికులు చేతివృత్తిదారులు ఉపాధి పొందుతున్నారన్నారు. ఇది వారికి చట్టబద్ధమైన హక్కుగా మారిందనీ కేంద్రం ఇటువంటి చట్టానికి పేరు మార్చి నిధుల కొరత ద్వారా నిర్వీర్యం చేయడానికి చేస్తున్న ప్రయ త్నాలపై కష్టజీవులు వ్యవసాయ కూలీలలో ఆందోళన నెలకొందన్నారు. గతంలో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దానికి వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ పథకాన్ని తీసుకొచ్చి గ్రామీణ పేదలను రోడ్డున పడేవిధంగా చేశారన్నారు. ఈ కొత్త పథకం గ్రామీణ పేదలు వ్యవసాయ కూలీల శ్రమను కార్పొరేట్లకు దోచుకునేందుకు ఉపయోగ పడుతుందని, కాబట్టి తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు కలాం మౌలాలి, రాముడు ,జగదీష్, జయమ్మ, రవి, శ్రీలత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డోన్‌లో..

నంద్యాలలో..

బనగానపల్లెలో..

ప్యాపిలిలో..

ఎస్టీ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాలో పనిచేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు వి.వెంకటప్ప అన్నారు. సోమవారం శ్రీ రామకృష్ణ పీజీ కళాశాల సెమినార్ హాలులో ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు వి.వెంకటప్ప గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగుల సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ సభ్యులు వి.వెంకటప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి విశేష కృషి చేయడం జరుగుతుం దన్నారు. గిరిజన వసతి గృహాలలో

విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, వచ్చే ఏడాది ప్రతి వసతి గృహంలో వందశాతం విద్యార్థులను చేర్పించే విధంగా తగు చర్యలు చేపట్టాలని వార్డెన్ లకు సూచించారు. పదవ తరగతి లో మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే విధంగా ప్రత్యేక ట్యూషన్లు ఏర్పాటు చేసి బాగా చదివించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు. ఎస్టీ వసతి గృహాలలో గదుల సమస్య, మంచినీటి సమస్య, మరుగుదొడ్ల వంటి సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు వారి సమస్యలపై పలు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఓ శివప్రసాద్, ఎసిటిడబ్ల్యూఓ హుస్సేనయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దుమావత్ స్వామి నాయక్‌తో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ట్రెజరీ ఉద్యోగి

విశాలాంధ్ర-డోన్: రూ.30వేలు లంచం తీసుకుంటూ లక్ష్మణ్ నాయక్ పట్టుబడ్డారు. సోమవారం డోన్ ఉప ఖజానా కార్యాలయంలో ఏసీబీ దాడులు నిర్వహించారు. కర్నూలు ఏసీబీ డిఎస్పి సోమన్న మాట్లాడుతూ ఉప ఖజానా కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ నాయక్ పనిచేస్తున్నారన్నారు. డోన్ మున్సిపల్ కార్యాలయం రెవెన్యూలో సెక్షన్లో పనిచేస్తూ రిటైర్డ్ ఉద్యోగి శ్యామరాజు 6నెలల క్రితం రిటైర్డ్ అయ్యా దన్నారు. ఆయనకు పదవిరమణ అనంతరం రావాల్సిన పింఛన్ భేనిఫిట్స్ కోసం సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ నాయక్ ను ఆశ్రయించాడన్నారు. గత 5 నేలలుగు పని చేయకుండా తిప్పుకుంటున్నాడన్నారు. లక్ష్మణ్ నాయక్ రూ.30 వేలకు బేరం కుదుర్చుకొని లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా డబ్బులు అడిగితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

గోకవరం, బట్టువారిపల్లి గ్రామాలను పంచాయతీ చేయాలి

విశాలాంధ్ర- కొత్తపల్లి: మండలంలోని గోకవరం బట్టువారిపల్లి గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని మల్లయ్య, మునిరంగ, బాష పోగు సుంకన్న, పకీరయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న ఎంపీడీవో మేరి డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు కు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు కోసం గ్రామస్తులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వారు మాట్లాడుతూ గోకవరం గ్రామ పంచాయతీలో ఎం. లింగాపురం, గోకవరం, బట్టు వారిపల్లి గ్రామాలు ఉన్నాయి. అయితే ప్రత్యేక పంచాయతీగా బట్టు వారిపల్లి గోకవరమును చేయాలని తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవో మేరీ మాట్లాడుతూ గ్రామస్తుల వినతి పత్రాన్ని జిల్లా అధికారులకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ విజయుడు గ్రామస్తులు ఉన్నారు.

పీఆర్సీ కమిషన్ వేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పిఆర్సి కమిషన్‌ను వెంటనే వేయాలని ఆల్ మేవా, ఏపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆల్ మెవ, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు ఇంజనీర్ సయ్యద్ ఇమ్రాన్ పాష, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్ఎండి అబులైస్, జిల్లా అధ్యక్షులు సయ్యద్ మహమ్మద్ ఫరూక్ అధ్యక్షతన జరిగిన ఆల్ మేవా జిల్లా వార్షిక సమావేశానికి సంబంధించిన రివ్యూ మీటింగ్ లో ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వవలసిన డిఎ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పీఆర్సి కమిషన్ వేయాలని, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోమిన్ సైఫుల్ల, నబీరసూల్, మాలిక్ బేగ్, మహమ్మద్ రఫీ, జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలీం, మహమ్మద్ గౌస్, మహమ్మద్ ఖాసిం, షఫీ ఉల్లా, మునీర్ అహ్మద్ అమీరుద్దీన్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలు

విశాలాంధ్ర-కొత్తపల్లి: కొత్తపల్లి: క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని ఎర్రమఠం గ్రామంలో ఈ నెల 27, 28వ తేదీల్లో జిల్లా స్థాయి, గ్రామీణ స్థాయిల్లో బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించ నున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు ఎన్.చిన్న నాగేశ్వర రావు, మలిరెడ్డి నరసింహ, మలిరెడ్డి చిన్న వెంకటరమణలు సోమవారం ఒక ప్రటకనలో తెలిపారు. పండుగ సందర్భంగా సీఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.10,016లు, రెండో బహుమతిగా రూ.7,016లు, మూడో బహుమతిగా రూ.5,016, నాల్గో బహుమతిగా రూ.2,016లు, గ్రామీణ స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.8,016లు, రెండో బహుమతిగా రూ.6,016లు, మూడో బహుమతిగా రూ.4,016లు, నాల్గో బహుమతిగా రూ.2,016లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 26 సాయంత్రంలోపు రూ.300 లు ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీలకు వచ్చే క్రీడాకారులకు సీఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు 9866929360, 6302709704, 9666866814లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

లైంగిక వేధింపుల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. సోమవారం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం, బాలికలపై లైంగిక వేధింపుల నిర్మూలనపై అవగాహన, టోల్ ఫ్రీ నంబర్ల గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న వేధింపులను నిరోధించే చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సమాజంగా బాధ్యత తీసుకొని ఈ అకృత్యాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. నేటి సమాజంలో బాలికలు, యువతులపై జరుగుతున్న వేధింపులు, ఆత్మహత్యా యత్నాలు, బలవన్మరణాలు వంటి సంఘటనలపై మహిళలు, బాలికలకు అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పోక్సో సవరణ చట్టం 2012లోని సెక్షన్ 17 ప్రకారం బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ పీడీ లీలావతి ఆధ్వర్యంలో అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. అంగన్ వాడి సూపర్వైజర్లకు, టీచర్లకు సాంసంగ్ ఫైవ్ జీ సెల్ ఫోన్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పేద బడుగు బలహీన వర్గాల వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా ఉంటున్నదని తెలుగు యువత మండల అధ్యక్షులు గొంగటి హుస్సేన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెట్నికోట గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబం గొంగటి భాస్కర్ రెడ్డికి ఆయన అందించారు. పేద కుటుంబాలు అనారోగ్యానికి గురైనప్పుడు చికిత్స నిమిత్తం ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్ళినప్పుడు వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద కుటుంబాలను ఆదుకునేందుకు సిఎంఆర్ఎఫ్‌ను అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో లబ్ధిదారునికి రూ.27818 విలువగల చెక్కును అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీలర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

అగౌరవపరిచిన బీహార్ సీఎం రాజీనామా చేయాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మహిళా వైద్యురాలిని అగౌరవపరిచిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వ ర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో పలు ప్రజాసంఘాల నాయకులు, మహిళలు నిర సన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ బీరువాల బాష, ఆళ్లగడ్డ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బరగొడ్ల హుస్సేన్ భాష, ఎస్డిపిఐ అసెంబ్లీ నాయకులు ముక్తార్ తదితరులు మాట్లాడుతూ బీహార్ ముఖ్యమంత్రి హిజాబ్‌కు సంబంధించిన వ్యాఖ్యలు ముస్లిం సమాజ భావోద్వేగాలను దెబ్బతీయటమే కాకుండా భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కులపై ప్రశ్నార్థకంగా మారాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ వెస్లీ, మాల మహానాడు బక్కవాళ్ళ చంద్రశేఖర్, సెక్రటరీ చక్రవర్తి, రజకుల సంఘం నాయకులు ఆమదాల రమణ తదితరులు మాట్లాడుతూ హిజబ్ అనేది ఒక మతాచారం మాత్రమే కాకుండా మహిళా గౌరవం వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రతీక అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్డిపిఐ జిల్లా కార్యదర్శి కరిముల్లా, ఫక్రుద్దీన్, నూర్ భాషా సంఘం నాయకులు మస్తాన్, జేఏసీ కమిటీ సభ్యులు బైక్ మెకానిక్ నూర్ బాష, హుస్సేన్ మజీద్ మౌజన్ను హుస్సేన్ బాష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీపీ రావు వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - నందికొట్కూరు: పట్టణంలోని స్థానిక మాల మహానాడు కార్యాలయం నందు మాల మహానాడు తాలూకా అధ్యక్షులు పబ్బతి శివప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం మాల మహానాడు వ్యవస్థాపకులు దివంగత నేత పి.వి రావు 20 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ మహానేత స్వర్గీయ పి.వి.రావు అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచి వర్గీకరణ విషయంలో అప్పటి ప్రభుత్వాలను గడగడలాడించిన ఏకైక వ్యక్తి అని అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం ఆయన ఎంతో కృషి చేశారని ఆయన సేవలు పోరాటం ఎన్నటికీ మరువలేనివి అని, ఆయన గురించి ఎంత మాట్లాడినా తక్కువే అని ఆయనకు జాతి పట్ల ఎంతో చిత్తశుద్ధి ఉందన్నారు. చివరకు ఆయన ప్రాణాలు సహితం జాతి కోసం అర్పించిన మహా త్యాగ పురుషుడని మాల జాతి లో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందనీ ఆయన ఆశయాలను ఎప్పుడైతే ముందుకు తీసుకొని పోయి ఆయన ఆశయాలు సాధించిన నాడే దివంగత నేత పి.వి రావుకు ఘనమైన నివాళులర్పించి నట్లు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు తాలూకా ఉపాధ్యక్షులు పుల్లన్న, మాల మహానాడు నాయకులు తాటిపాటి అయ్యన్న, చెన్ను పత్రికేయులు దక్క జంబులయ్య, ఉష నాళం, కూన. నాగన్న, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గురురాజాలో ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీ నందు గల గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు దేశంలో గర్వించదగ్గ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ డైరెక్టర్ పి. షేక్షావలిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.దస్తగిరిరెడ్డి, డైరెక్టర్ పి.మౌలాలిరెడ్డి విచ్చేసి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి వందన సమర్పణ గావించారు. విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శిం చిన గణిత నమూనాలు, మ్యాథమెటిక్స్ ఫార్ములాస్‌తో కూడిన ఆక్టివిటీస్ ఆకట్టుకున్నాయి. గణిత శాస్త్ర దినోత్సవం పురస్కరించుకొని స్కూల్ అంతర్భాగంలో భాగంగా మ్యాథ్స్ బి, క్విజ్ పోటీలు విజేతలకు మెడల్స్ అందజేసి వారివిజయాలను ప్రశంసించారు.

వ్యాయామ సంచాలకులు బాషను సన్మానించిన వ్యాయామ సంచాలకులు

విశాలాంధ్ర- సంజామల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వ్యాయామ సంచాలకులు భాషను సంజామల మండలంలో పనిచేస్తున్నటువంటి ఇతర వ్యాయామ సంచాలకులందరూ కలిసి సోమవారం పాఠశాల యందు ఘనంగా సత్కరించారు. ఈ నెల 10,11 తేదీలలో నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో హై జంప్ నందు నందు ప్రథమ స్థానం, జావలిన్ త్రో నందు ప్రథమ స్థానం, షాట్ పుట్ త్రో నందు ద్వితీయ స్థానం సాధించి జనవరి నెల 28వ తేదీ నుండి ఫిబ్రవరి 1వ తేదీ వరకు కేరళలోని తిరువనంతపురంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనందుకు వ్యాయమ సంచాలకులు బాషను సన్మానించారు. ఎంఈఓ వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ బాష విజయాల వల్ల సంజామల మండలం ఖ్యాతి అంతర్జాతీయ స్థాయిలో వెలుగొందిందని తెలియజేశారు. కానాల పీడీ మౌలాలి మాట్లాడుతూ గ్రామానికి మరియు మండలానికి బాష వల్ల పేరు ప్రఖ్యాతులు వస్తున్నాయని తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు పరమేశ్వర్ రెడ్డి భరత్ కుమార్ రెడ్డి వెంకటరమణ బాలస్వామి మనోహర్ శ్రీమతి వసంత లక్ష్మి శ్రీరామ పుల్లయ్య, మిగతా వ్యాయామ సంచాలకులు హుస్సేన్ వలి, పవన్ కుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక వనరులు పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - పాణ్యం: మహిళలు ఆర్థిక వనలను పెంపొందించుకోవాలని సర్ఫ్ అడిషనల్ సీఈవో శ్రీరాములు అన్నారు. సోమవారం పొదుపుభవనంలో పొదుపు మహిళచే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థిక భద్రత కూడిన జీవనోపాధిని కలిగి ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం ఉన్నారు. గ్రామపంచాయతీలో ఉన్న మహిళ సంఘాలు సభ్యులు ఆర్థికంగా బలోపేతమే కావడమే కాకుండా వారి జోనోపాలను మెరుగుపరచుకోవాలన్నారు. మండల సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీవనోపాదుల స్టాళ్లను పరిశీలించారు. రిసోర్స్ పర్సన్లను శిక్షణ ఇచ్చే తద్వారా సంఘాలను మరింత బలోతుల చేసుకోవాలని తెలిపారు. జిల్లా పార్టీ మేనేజర్లు రంగారావు నాయక్, సురేష్, బాబురావు, నంద్యాల ఏరియా కోఆర్డినేటర్ ఏఎస్ ప్రసాద్, మండల సమైక్య అధ్యక్షురాలు కామాక్షమ్మ, సీసీలు రఘురాం పాల్గొన్నారు.

25న రాష్ట్ర స్థాయి సమావేశం

విశాలాంధ్ర - వెలుగోడు: బండి ఆత్మకూరు మండలం పెద్ద దేవలాపురం ఏకశిలా ఆంజనేయ స్వామి గుడి నందు బంజారా ధర్మ రక్ష సమితి రాష్ట్ర స్థాయి సమావేశం ఈ నెల 25 తేదీన జరుగుతుందని ఆ సంఘము రాష్ట్ర నాయకులు నగేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమము ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు జరుగుతుంది. కార్యక్రమంలో బంజారా ధర్మ రక్ష సమితి రాష్ట్ర కమిటి ఏర్పాటు, భోగ్ బండార ధర్మ రక్ష కంకణ ధారణ సేవాలల్ టికో బోగ్ పూజ, భోగ సభ, తండా సంకీర్తన సప్త నాయకి ప్రకటన తదితర కార్యకములు జరుగును. ఈ కార్యక్రమములో బంజారా సాధువులు, బంజారా ధర్మ గురువులు, ముఖ్యముగా బంజారా ధర్మ రక్ష సమితి రాష్ట్ర స్థాయి నాయకులు రావడం జరుగుతుంది. స్థానిక, చుట్టూ పక్కల గ్రామాల బంజారాలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమము విజయవంతం చేయగలరని చెప్పారు. స్థానిక బంజారా నాయకులు టీచర్ సుబ్బారాయుడు నాయక్, నాగ స్వామి నాయక్, బద్దే నాయక్, వెంకటేష్ నాయక్, దేశ్వాత్ నాగరాజు నాయక్, కొడవత్ శంకర్ నాయక్, స్వామి నాయక్ పాల్గొన్నారు.

ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుక వెళ్ళేది గణితం

విశాలాంధ్ర - పాణ్యం : జీవితాన్ని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకుని వెళ్లే ఏకైక సాధనం గణితం అని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి అన్నారు. విజయానికేతన్ ఉన్నత పాఠశాల నందు గణిత దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయానికేతన్ డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ నిజజీవితంలో అడుగడుగున గణితం యొక్క ప్రాధాన్యత ఉంటుందని అందుకే పెద్దలు లెక్కలు రానివాడు లెక్కలోకి రాడు అని అంటారని, గణితము తార్కికమైనదని ఆలోచన సామర్థ్యాన్ని పెంచి ఆనంద భావాలను కలిగిస్తుందని అన్నారు. చివరగా గణిత భాష ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తయారు చేసిన దాదాపు 100 రకాల గణిత నమూనాలు అందరిని ఆలోచింప జేశాయి. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఇంచార్జ్ మురారి, కోఆర్డినేటర్లు బ్రహ్మం, జహీర్, బాలకృష్ణ, గణిత ఉపాధ్యాయ బృందం మునిరెడ్డి, సుబ్బయ్య, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆళ్లగడ్డ తాలూకాలోని అంగన్వాడి టీచర్స్, సూపర్వైజర్స్‌కి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ 5జి మొబైల్స్ ను సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత ఫోన్లో నెట్వర్క్ సమస్యల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం 5జి స్మార్ట్ ఫోన్లు అందిస్తున్నదని తెలిపారు. సాంకేతిక ఇబ్బందులు కలగకుండా ఆధునిక ఫోన్లు అందజేశామన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో ఇవి ఎంతో ఉపయోగపడ తాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. కాగా, కొన్నేళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం కావడంతో అంగన్వాడీ టీచర్లు హర్షం వ్యక్తం చేశారు. సిడిపిఓ తేజేశ్వరి, సూపర్వైజర్లు పార్వతి, దస్తగిరమ్మ పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి

విశాలాంధ్ర -కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులు రబీ సీజన్లో వేసిన పంటలకు ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమీ రున్నిసా బేగం తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవ సిబ్బంది తో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రైతులు రబీ సీజన్లో వేసిన పంటలకు ఈ-పంట నమోదు ప్రక్రియ మొదలు అయిందన్నారు. రైతులు వేసిన పంటకి ఈ -పంట కచ్చితంగా నమోదు చేయాలి అని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ - ప్రతి రైతుకి ఒక ఐడి తప్పనిసరి, వ్యవసాయంకు సంబందించిన పథకాలు ఫార్మర్ రిజిస్టర్ తో ముడిపడి ఉన్నాయి అని తెలియచేశారు.

ఇంటింటా పల్స్ పోలియో కార్యక్రమం

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని హైరిస్క్ ప్రాంతాలైన చాగలమ్మ చెంచు కాలనీ, జాతీయ రహదారి ప్రక్కన పూరి గుడిసెలలో నివాసముంటున్న వలస కుటుంబాల లోని చిన్నపిల్లలకు ఇంటింటికి పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా వైద్యులు ఆ ఇమ్రాన్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 నుండి ఐదేళ్ల చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

పోలీస్ స్టేషన్ చేరిన మొబైల్ పంచాయతీ

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: పట్టణంలో మొబైల్ షాప్ దుకాణాలు నిర్వహిస్తున్న మార్వాడిలు రిటైల్ వ్యాపారాలు చేస్తూ తమ వ్యాపారాలకు గండి కొడుతున్నారని స్థానిక మొబైల్ షాప్ యజమానులు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి పోలీసులను ఆశ్రయించారు. దాదాపు పట్టణంలోని 40 మొబైల్ షాప్ యజ మానులు సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరుక న్నారు. రాజస్థాన్ కు చెందిన మార్వాడి అర్జున్ అనే వ్యక్తి రాందేవ్ మొబైల్ స్పేర్ పార్ట్స్ పేరుతో పాత ఆంధ్ర బ్యాంకు వద్ద దుకాణాన్ని నెలకొల్పాడు. మార్వాడి అర్జున్ మొబైల్ దుకాణం ఏర్పాటు చేసే సమయంలో తాను రిటైల్ వ్యాపారం చేయనని కేవలం హెూల్ సేల్ వ్యాపారమే చేస్తానని స్థానిక మొబైల్ దుకాణదారులకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అందుకు ప్రతిగా స్థానిక మొబైల్ దుకాణదారులు మార్వాడి అర్జున్ ఏర్పాటు చేసిన రాందేవ్ మొబైల్ స్పేర్ పార్ట్స్ దుకాణం లోనే వారికి కావలసిన మొబైల్ పరికరాలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కొంతకాలం వ్యాపారం సజావుగా సాగినప్పటికీ ఇటీవల కాలంలో మార్వాడి అర్జున్ తన మొబైల్ దుకాణంలో హెూల్ సేల్ బిజినెస్‌తో పాటు రిటైల్ బిజినెస్ చేస్తున్నడంతో స్థానిక మొబైల్ వ్యాపారులు ఆందోళనలో పడ్డారు. మార్వాడి అర్జున్ తమ వ్యాపారానికి గండి కొట్టి తమ పొట్ట కొడుతున్నాడన్నారు. దీంతో చేసేది ఏమీ లేక స్థానిక మొబైల్ వ్యాపారులందరూ కలిసి పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు వ్యవ హారంపై ఇరు వర్గాలతో చర్చలు జరిపారు. ఈ చర్చలు ఒక కొలిక్కి రాకపోవడంతో స్థానిక మొబైల్ వ్యాపారులు అందరు కలిసి బనగానపల్లెలోని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి క్యాంపు కార్యాలయానికి వెళ్లి వారి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై చర్చించి తగు న్యాయం చేస్తానని మంత్రి వారికి హామీ ఇవ్వడం జరిగింది.

పంటలపై రాంకో పరిశ్రమ నుండి దుమ్ము

- పరిశీలించిన సీపీఐ నాయకులు
- రైతులకు న్యాయం చేయాలని డిమాండ్

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని కలవటాల గ్రామ పరిధిలోని రాంకో సిమెంట్ పరిశ్రమ నుండి వెలువడుతున్న కాలుష్యం, దుమ్ము వలన సాగు చేసిన పంటలు దెబ్బతింటున్నాయని రైతన్నల ఆందోళన చెందుతున్నారు. రాంకో చుట్టుపక్కల ప్రాంతాలలో దాదాపు 400 ఎకరాలకు పైగా పప్పు సెనగ, కంది,కుసుమ తదితర పంటలను రైతన్నలు సాగు చేశారు. రామ్‌కో నుండి వెదజల్లుతున్న సిమెంట్ డస్ట్, కాలుష్యముతో పాటు వాహనాల రాకపోకలతో పంటలన్నీ దుమ్ముతో నిండుకుంటున్నాయి. సోమవారం మండల సిపిఐ నాయకులు సూర్య నారాయణ, రైతు సంఘం నాయకులు వినయ్, పెద్దయ్య, తదితరుల్తురైతులతో కలిసి సిమెంట్ పరిశ్రమ ప్రాంతంలోని పంటలను పరిశీలించారు. దుమ్ముతో నిండిపోయిన పప్పు సెనగ, కుసుమ పంటలను పరిశీలించి రైతుల నుండి వివరాలు సేకరించారు. రాంకో చుట్టుపక్కల ప్రాంతాలైన కలవటాల,కొలిమిగుండ్ల, మీర్జాపురం పరిధిలో సిమెంట్ పరిశ్రమ వలన సాగుచేసిన పచ్చని పంట పొలాలు దెబ్బతింటున్నాయని, దుమ్ము కాలుష్యం వలన పంటల దిగుబడి లేక నష్టాలు పాలవుత న్నట్లు రైతులు తెలిపారు. సాగు పెట్టుబడి కూడా రావడం లేదని గత కొన్ని సంవత్సరాలుగా పంట దిగుబడి లేకపోవడంతో నష్టాలను

మూటకట్టుకుంటు న్నామని రైతులు తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా న్యాయం జరగడం లేదని వాపోయారు. దుమ్మే కాకుండా రాంకో కొనుగోలు చేసిన భూములలో కంపచెట్లు పెరగడంతో పందు లకు నివాసాలుగా మారి పంటలను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. అనంతరం సిపిఐ నాయకులు మాట్లాడుతూ పంటలకు నష్టం కలిగిస్తున్న రాంకో పరిశ్రమపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాంకో నుండి వెలబడు తున్న కాలుష్యము దుమ్ము వలన పంటలన్నీ దెబ్బతిని దిగుబడి లేకుండా అన్నదాతలు నష్టపోతున్నారన్నారు. నష్టపోతున్న అన్నదాతలను ఆదుకునే రాంకోపై చర్యలు తీసుకుని నష్ట పరిహారం చెల్లించేలా చూడాలన్నారు. రైతులు బాల నాగేశ్వరరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-అవుకు: తమతోపాటు విద్యను అభ్యసించిన మిత్రుడు గుండె పోటుతో మృతి చెందగా మిత్ర బృందం ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 సంవత్సరంలో 10వ తరగతి విద్యన అభ్యసించిన అవుకు పట్టణానికి చెందిన శెనగల వెంకటేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు మిత్రుని కుటుంబానికి అండగా నిలవాలని భావించి 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వెంకటేష్ కుటుంబ సభ్యులకు అందించారు. స్నేహితుని కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన మిత్రులకు వెంకటేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తమ బ్యాచ్ లో ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకోవడానికి ముందు ఉంటామని అన్నారు. వెంకటేష్ పిల్లల చదువు విషయంలో ఎలాంటి సహకారం కోసమైనా అండగా నిలుస్తామని మిత్రులు అన్నారు. ఈ కార్యక్రమంలో మిత్రులు రాజేష్, రామాంజనేయులు, చాంద్ బాష తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండ సీపీఐ జెండా : పి. రామచంద్రయ్య

విశాలాంధ్ర - పత్తికొండ : పేద ప్రజలకు అండ సీపీఐ జెండ అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామ చంద్రయ్య అన్నారు. సోమవారం సీపీఐ శతవంతోత్స వాలను మద్దికెర మండలం పెరవలి శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సీపీఐ సీనియర్ నాయకులు బసన్న పార్టీ పతాకాన్ని ఆవిష్కరించగా, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పి.రామచంద్రయ్య మాట్లాడుతూ పేద ప్రజలు, కష్టజీవులు, కార్మికులు, కర్షకుల పక్షాన సీపీఐ అలుపెరగని పోరాటాలు చేపట్టిందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. భూ సంస్కరణల చట్టం, బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, వెట్టి చాకిరి విముక్తికై సీపీఐ అనేక పోరాటాలు చేపట్టిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేపట్టేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రాజాసాహెబ్, మద్దికెర మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు వెంకటరాముడు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న కాలనీ

కాలువలు నిండి, రోడ్లపై పారుతున్న మురుగునీరు

పండుగలు వచ్చినా ఆ కాలనీపై అంత చిన్నచూపా?

విశాలాంధ్ర - నందవరం : దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడుస్తున్నా గ్రామాలు మాత్రం ఎలాంటి అభివృద్ధికి నోచు కోలేదంటే అతిశయోక్తి కాదు. గ్రామాల్లో ఎస్సీ కాలనీలంటే మరి చిన్నచూపు. ఇప్పటికీ అంటరానితనం ఉందంటే దేశం ఎంత అభివృద్ధి చెందిందో అర్థం అవుతోంది. మండల పరిధి లోని ఇబ్రహీంపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో అభివృద్ధికి ఏమాత్రం నోచుకోలేదు. ఇక్కడి మురుగునీటి కాలువల వ్యవస్థ ఎక్కడికక్కడే విలయతాండవం చేస్తోంది. మురుగునీరు నీటి కాలువలు నండి రోడ్లపైనే ప్రవహిస్తున్నా అధికారులు, నాయ కులు మాత్రం ఆ కాలనీపై కన్నెత్తి చూడ టం లేదనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. ఆ కాలనీ వాసులు కంపు కొడుతున్నా మరుగువాసనతో కలిసి జీవిం చాల్సిన పరిస్థితి నెలకొంది. క్రైస్తవులకు ఎంతో ప్రాముఖ్యమైన పండు క్రిస్మస్, జనవరి 1 పండుగలు. అయినా కాలనీలో పూడిక తీయించకపోవడం చాలా బాధాకరమైన విషయమని గ్రామ స్తులు ఆవేధన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో దళితుల ఓట్ల కోసం పాకులాడే నాయకులు ఇలాంటి సమయంలో మేము కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి శుభ్రం చేయిస్తారా.. లేదా దళితులే కదా అనే చిన్నచూపుతో ఆ కాలనీని వదిలేస్తారా అని వేచి చూడాలి మరీ..

విద్యుత్ వినియోగదారుల సమస్యలు తక్షణ పరిష్కారం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ దక్షణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కరంటోళ్ళ జనబాట కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.సిరి తెలిపారు. సోమవారం సునయ ఆడిట రియంలో కరంటోళ్ళ జనబాట కార్యక్రమం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగ దారు లకు నాణ్యమైన, నిరంతరం విద్యుత్ అందించడమే లక్ష్యమన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం విద్యుత్ అధికారులు, సిబ్బంది, నిర్దేశించిన, గ్రామాలు, పట్టణాలు, వార్డులు సందర్శించి అక్కడ విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 11కెవి, ఎల్టీ, వ్యవసాయ లైన్‌లు పరిశీలించి క్రిందకు వేలాడే లైన్‌లను సరిచేయాలన్నారు. ప్రమాదకరమంగా మారిన విద్యుత్ స్తంబాలను గుర్తించి వాటిని సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ నూర్ కమర్, డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, ఎస్ఈ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యలో ఎంపిక చేసిన ఉద్యోగినులకు నియామక పత్రాలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జిల్లాలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహ పెద్దపాడు, పత్తికొండ ప్రభుత్వ బాలసదన్‌లలో ఖాళీగా ఉన్న సోషల్ వర్కర్, ఆయా, అర్ట్ అండ్ క్రాఫ్ట్, ఎడ్యుకేటర్, యోగా, వంటమనిషి, వాచ్‌మెన్, ఉద్యోగాలకు సోమవారం సునయలో నియామక పత్రాలు అందచేశారు. మిషన్ వాత్సల్యలో ఎంపిక చేసిన ఉద్యోగినులకు నియామక పత్రాలు అందించినట్లు జిల్లా కలెక్టర్ ఎ.సిరి తెలిపారు. ఎంపికైన సిబ్బందితో కలెక్టర్ మాట్లాడుతూ విధినిర్వాహణలో అంకిత భావంతో పనిచేయాలన్నారు. ప్రత్యేకించి శిశు గృహ ప్రత్యేకించి ప్రభుత్వ బాలసదన్‌లో ఉన్న పిల్లలను తమ పిల్లలుగా భావించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు.

మరిదిచేతిలో వదిన హత్య

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని తొగలగళ్ల గ్రామంలో గొల్ల గంగావతి (26) అను మహిళను రోకలిబండతోకట్టి హత్య చేసిన ఘటన సోమవారం సంచనం సృష్టించింది. కల్లపారి గ్రామానికి చెందిన గొల్ల చిన్న ఉరుకుందు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతు. ఆయన కూతురు గంగావతిని ఎనిమిదేళ్ల కిందట తొగలగళ్ల గ్రామానికి చెందిన ఆహోబిలంకు ఇచ్చి వివాహం చేశారు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. కాగా, గత సెప్టెంబర్ నెలలో భర్త హత్య కేసులో గంగావతి జైలుకెళ్లి బెయిల్‌పై ఇటీవల విడుదలైంది. తమ్ముడిని చంపిన మరదలపై ప్రతీకారం తీర్చుకోవాలని ఆదివారం రాత్రి రేకుట కొట్టంలో నిద్రిస్తున్న గంగావతిపై రోకలి కట్టెతో కొట్టి ప్రాణాలు తీశాడు. ఘటన అనంతరం నిందితుడు మోటార్ బైక్‌పై పరారైనట్లు సమాచారం. బాధితురాలి తండ్రి చిన్న గొల్ల ఉరుకుంద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

సమన్వయంతో పని చేయండి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని నగరపాలక సంస్థ ఇంచార్జీ కమిషనర్ (ఎఫ్ఏసి) ఆర్‌జివి కృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వార్డుల నుండి 17 అర్జీలను స్వీకరించిన ఇంచార్జీ కమిషనర్ సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షురాలిని కలిసిన నాయకులు

విశాలాంధ్ర - హొళగుంద : జిల్లా టీడీపీ అధ్యక్షురాలుగా నియమి తులైన గుడిసె కృష్ణమ్మను టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పార్టీ పట్ల నిరంతర అంకితభావం, ప్రజాసేవ పట్ల నిబద్ధత, నాయకత్వ సామర్థ్యాన్ని ప్రశంసించిన నాయకులు, ఆమె నాయకత్వంలో టిడిపి కర్నూలు జిల్లాలో మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మైనారిటీ అధ్యక్షుడు ముల్లా మోయిన్ మండల కోకన్వీనర్ కె జాకీర్ టీడీపీ మండల మైనారిటీ ప్రధాన కార్యదర్శి బి.అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ యార్డ్‌లో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : సోమవారం పర్యవేక్షక సిబ్బందితో కలిసి కర్నూలు మార్కెట్ యార్డ్ కార్యదర్శి జయలక్ష్మి కాటాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాటాల నిర్వహణలో ఎలాంటి అవకతవ కలు జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాటాల్లో వ్యత్యాసాలు గమనిస్తే వెంటనే మార్కెట్ యార్డ్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాగే పర్యవేక్షక సిబ్బంది ప్రతిరోజూ కాటాలను తనిఖీ చేయాలని ఆదేశించారు.

పారిశుద్ధ్య కార్మికులు జీతాలు పంపిణీ

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్ల లో సోమవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు, సర్పంచ్ పూజారి హైమవతి జీతాలు వంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పూజారి హైమవతి మాట్లాడుతూ డ్యూపీటీ ఎంపీడీవో అనంత శేనా ఆదేశాలు మేరకు పెండింగ్‌లో ఉన్న జీతాలు సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల జీతాలు పంపిణీ చేసినట్లు సర్పంచ్ పూజారి హైమవతి తెలిపారు. ఇంచార్జీ పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్, మల్లాంగ్, సుభాన్, అనిల్, వార్డు సభ్యులు అక్బర్‌లు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో.. హామీ ఎక్కడ?

గాడ్సే వారసులను తృప్తి పరిచేందుకేనా

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఉపాధి హామీ పథకంలో హామీ లేకుండా చేసి, గాడ్సే వారసులను తృప్తి పరిచేందు కు పథకంలో గాంధీ పేరు లేకుండా చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా వామపక్షపార్టీల ఆధ్వర్యంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సీపీఎం నాయకులు రాముడు అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట నిరసన కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామాంజనేయులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌యూసీఐ నాయకులు నాగన్న, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్‌బాబులు పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి హరి నాథరెడ్డి మాట్లా డుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అద్భుతమైన పథక మన్నారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వలసలు పోకుండా వారికి ఉపాధి అందిస్తుం దన్నారు. పథకంను నిర్వీర్యం చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. ఇలాంటి పథకాన్ని పట్టణాలకు విస్తరింప చేసి, పట్టణ ప్రాంతాల్లోని యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈ పథకంలోని మహాత్మాగాంధీ లాంటి స్వాతంత్ర్య సమరయోధుని పేరు తొలగించాలని నిర్ణయం తీసుకో వడం దుర్మార్గమన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో ఎలాంటి పాత్రలేని వ్యక్తులుగా ంధీ పేరును తొలగించాలని చెప్పడం దారుణమన్నారు. ఉపాధి హామీ చట్టంను నిర్వీర్యం చేయుటకు కేంద్రం నిధులను 60శాతం వాటా మాత్రమే ఇస్తామని, రాష్ట్ర 40శాతం బరించాలని చెప్పడం ఈ పథకంను ఏదో విధంగా అబాసుపాలు చేసి తొలగించాలనే కుట్రలో భాగమే నన్నారు. రాష్ట్రం ఇప్పటికే అప్పులపాలైతే కేంద్రం ఉపాధి పథకంకు 4వేల కోట్లు బరించాలని చెప్పడం రాష్ట్రంపై మరింత బారం పడటమే కాకుండా ఈ పథకంను నిర్వీర్యం చేయడమే నన్నారు. చిన్న రాష్ట్రాలు కనీసం 10 రోజులు కూడా ఉపాధి కల్పించలేని పరిస్థితి ఎదుర్కొంటున్నాయని తెలిపారు. దేశంలో పేదలు - ధనవంతుల మధ్య తారత మ్యం తగ్గించాల్సింది పోయి రోజురోజుకు పెరుగుతుం దన్నారు. ప్రశ్నించే వారిని జైలుల్లో పెట్టడమే కాకుండా అంతమొందించే కుట్రలు చేస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకు వచ్చిందన్నారు.రైతులు పెట్టుబడి దారులకు ఊడిగం చేసేలా చేస్తున్నారని తెలిపారు. ప్రజలను కట్టుబానిసలుగా మార్చె కుట్ర జరుగుతుందని విమర్శించారు. పథకం నిర్వీర్యం కావడం వలన వలసలు పెరడమే కాకుండా, ఆకలిచావులు పెరుగుతా యన్నారు. ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను యధావిధిగా కొనసాగించాలని, 200 రోజులు పనిదినాలు కొనసాగించాలని, కేంద్రప్రభుత్వమే నిధులు మంజూరు చేయాలని, రాష్ట్రాలపై బారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ

రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు కె రామాంజనేయులు మాట్లాడుతూ ఈ పథకం లో మహాత్మాగాంధీ పేరును తొలగించాలనే నిర్ణయం దుర్మార్గమైందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు మౌనం దాల్చడం ఏమిటని ప్రశ్నించారు. ఈపథకంను మార్పు చేయడం వలన కష్టజీవులు, చేతివృత్తి దారులు ఆందోళన చెందుతున్నారని వెంటనే ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శ వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌యూసీఐ నాయకులు నాగన్న తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మనోహర్‌మాణిక్యం, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, వెంకటేష్, ఈశ్వర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమన్న, శరత్, ఏఐవైఎఫ్ నాయకులు ఎం.బీసన్న, సీపీఎం ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద

ఆలూరు..

ఆస్పరి..

దేవనకొండ..

కోడుమూరు..

పత్తికొండ..

వెల్దుర్తి..

వెల్దుర్తి..

ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆదోని ప్రజల హక్కు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: గత వైసిపి ప్రభుత్వ హయాంలో మెడికల్ కళాశాలను ప్రభుత్వం నిర్మించి ప్రజలకు అంకితం చేయాలన్న లక్ష్యంతో మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ప్రభుత్వం నిర్మాణం చేపట్టడం జరిగిందని, తీరా ప్రభుత్వం మారిన తర్వాత పిపిపి విధానంతో ప్రజల ఆశయాన్ని నీరుగారిచే దిశలో కూటమీ ప్రభుత్వం పూనుకుందని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆగ్రహ వ్యక్తం చేశారు. సోమవారం మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఆరెకల్ సమీపంలో ఉన్న మెడికల్ కళాశాల ముందు సిపిఐ పట్టణ కార్యదర్శి టి.వీరేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు అధ్యక్షతన ధర్నా నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ నాయకులు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, రాష్ట్ర కోకన్వీనర్లు లక్ష్మణ రెడ్డి, కొరవి వినయ్ కుమార్, ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అనంతరం మెడికల్ కళాశాలలో పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్లు లక్ష్మణ రెడ్డి, కొరివి వినయ్ కుమార్,సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు దిలీప్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నాగరాజు, సిపియు ఎస్ యు రాష్ట్ర నాయకులు కోదండ, బిఎస్‌పి జిల్లా నాయకులు రామలింగ మాట్లాడుతూ పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై వారు తీవ్రంగా మండిపడ్డారు. ప్రతిపక్షంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వైద్య విద్యకు పేదలకు దూరం చేసే పద్ధతుల్లో 509, 107, 108 జీవోలను తీసుకువచ్చి వైద్య విద్యను 50శాతం ప్రైవేటీకరణ చేస్తే అప్పటిలో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ గగ్గోలు పెట్టి పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న వైఎస్ఆర్సిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో 107, 108 జీవోలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తవుతున్నప్పటికీ ఇచ్చిన హామీలలో భాగంగా జీవోలను రద్దు చేయకపోగా 100శాతం వైద్య విద్యను పిపిపి విధానంలో ప్రైవేటీకరణ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి దస్తగిరి, పిడిఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుమలేష్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు, సోమలింగ, అఖండ, డిఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఉదయ్, తదితరులు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, మండల కార్యదర్శి కలుభవి రాజు, బసాపురం గోపాల్, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి ఎంకప్ప, ఓబి నాగరాజు, సిపిఎం పట్టణ,మండల కార్యదర్శిలు లక్ష్మన్న, లింగన్న, సీనియర్ నాయకులు రామాంజనేయులు, ఈరన్న పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని లాల్మన్ పల్లె గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత గురైనట్లు గ్రామస్తులు సోమ వారం తెలిపారు. వారు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్లనే మధ్యాహ్నం భోజనం తిని, గ్రామంలో చదువుతున్న పిల్లలు అస్వస్థకు గురయ్యారని వారు ఆరోపించారు. మధ్యాహ్నం భోజనాన్ని నిర్వాహకులు వండటంలేదని,హెూటల్ వారు వండుతున్నారన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత లేకపోవడం మెను ప్రకారం వంట చేయకపోవడం అధికారుల పర్యవేక్షణ అసలు లేకపోవడం, ఉపాధ్యాయులు పట్టిం చుకోవడం లేదని, ఇలాంటి సంఘటనలను మరెన్నో ఉన్నాయన్నారు. ప్రాథ మిక పాఠశాలలో చదువుతున్న మా పిల్లలకు మధ్యాహ్న భోజనం మెను ప్రకారంగా పెట్టాలని గ్రామస్తులు కోరారు. మధ్యాహ్నం భోజనం తిని అస్వస్థకు గురి కావడం మొరిగిన గుడ్లే కారణం అంటూ వారు ఆరోపిం చారు. విషయం తెలుసుకున్న మెడికల్ అధికారి తమ సిబ్బందితో హుటాహుటిన 108 అంబులెన్స్ తీసుకొని వచ్చి అస్వస్థకు గురైన 14 మంది పిల్లలకు డాక్టర్ వరప్రసాద్ వైద్యం చేసి మందులను ఇచ్చామన్నారు ప్రస్తుతం వారి ఆరోగ్యం మెరుగుపడినట్లు ఆయన తెలి పారు. మండల ఎంపీడీవో మోహన్ కుమార్ అస్వస్థత కు గురైన విద్యార్థులను ఆయన పరామర్శించారు.

ఆట స్థలాన్ని శుభ్రం చేయించిన నాయకులు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలో సోమవారం మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న సహకారంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆట స్థలంలో ఉన్న ముళ్ల కంపలను పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ లక్ష్మన్న, టిడిపి నాయకులు నరసింహులు, మానప్ప, నాగేష్, వీరేష్, బసప్ప, అయ్యప్ప, రాజు లు జేసీబితో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆట స్థలం గుంతలమయంగా ఉండటంతో పిల్లలు ఆడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో జేసీబితో ముళ్ల కంపలను తొలగించి, గుంతలను చదును చేయించినట్లు తెలిపారు.

పరిశుభ్రతలో భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : స్వచ్ఛతా హి సేవలో భాగంగా నేషనల్ ఎడ్యుకేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ ఆర్గనైజె షన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మాధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్ అధ్యక్షతన డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. స్కూల్ ఏజీఎం అన్వర్ బాష ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలను నిజంచేయడం, ప్రతిఒక్కరూ పరిశుభ్రతలో పాలుపంచుకోవాలన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 23, డిసెంబరు 2025

అందరి సమన్వయంతో పార్టీని బలోపేతం చేసుకుందాం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: టీడీపీ జిల్లా నూతన అధ్యక్షురాలుగా ఎన్నికైన గుడిసె ఆది కృష్ణమ్మను గౌరవప్రదంగా కలిసేందుకు తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివచ్చారు. గుడిసె ఆది కృష్ణమ్మ నివాసంలో తెలుగు తమ్ముల నీరాజనంతో ఆమె గడపలో కిటకిటలాడింది. వచ్చిన ప్రతి కార్యకర్త శాలువా పూల బొక్కే పూలమాలలతో సన్మానం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన తెలుగు తమ్ములను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి వార్డులో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మంచి సేవ కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటిపై తెలుగుదేశం పార్టీ జెండా ఉండే విధంగా, ప్రతి గడపలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటో ఉండే విధంగా కృషి చేయాల్సిన అవసరం మనందరిపై ఎంతైనా ఉందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్ష పదవి వచ్చిన శుభ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు గడప వద్దకు వెళ్లి మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అందరి సమన్వయంతో తెలుగుదేశం పార్టీ ఇచ్చే ప్రతి ఆదేశాలను అనుసరిస్తూ విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ సభ్యుడు ఆరెకల్ రామకృష్ణ, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు శ్రీరాములు, మాజీ ఎంపీపీ మురళి,మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప,మాజీ సర్పంచ్ మాధవ,రాజశేఖర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ మార్పిడి చికిత్స విజయవంతం

విశాలాంధ్ర - బళ్లారి చౌరస్తా : కర్నూలు మెడికవర్ హాస్పిటల్స్‌లో నాలుగో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సలో 60 ఏళ్ల అనసూయమ్మ తన 19 ఏళ్ల మనవరాలు రేవతికి కిడ్నీ దానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మమ్మ తన మనవరాలి జీవితానికి కొత్త ఆశను అందించడం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది. ఈ ఘటన ద్వారా వృద్ధ వయస్సులో ఉన్నవారు కూడా సరైన వైద్య పరీక్షల అనంతరం కిడ్నీ దానం చేయవచ్చని వైద్యులు స్పష్టంగా తెలియజేశారు. వయస్సు కంటే ఆరోగ్య పరిస్థితి ముఖ్యమని, సరైన ఫిట్‌నెస్ ఉంటే వృద్ధులు కూడా అవయవ దాతలుగా ముందుకు రావచ్చని వారు పేర్కొన్నారు. ఇది సమాజానికి ఒక కీలక అవగాహన సందేశంగా నిలుస్తోంది. ఈ కీలక శస్త్రచికిత్సను డా.ఎస్.అబ్దుల్ సమద్ (యూరాలజిస్ట్), డా.సిద్ధార్థ్ హెరూర్ (నెఫ్రాలజిస్ట్), డా.ఎన్.శివ ఫణీంద్ర (అనస్తీషియాలజిస్ట్) ఆధ్వర్యంలో అనస్తీషియా టీమ్, సహాయక నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో విజయ వంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం దాత, గ్రహీత ఇద్దరూ ఆరోగ్యంగా కోలుకుంటున్నారు. ఈ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా నిర్వహించడం విశేషం. దీని వల్ల బాధిత కుటుంబానికి ఆర్థిక భారం లేకుండా అత్యాధునిక చికిత్స అందించగలిగామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక స్థితి ఎలా ఉన్నా ప్రతి రోగికి అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యం. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కిడ్నీ మార్పిడి వంటి ఖరీదైన చికిత్సలను విజయ వంతంగా నిర్వహించడం మా ఆసుపత్రి సామర్థ్యాన్ని నిరూపిస్తోంది అని అన్నారు. ఈ విజయానికి కారణమైన వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని ఆయన అభినందించారు. రోగి కుటుంబ సభ్యులు మెడికవర్ హాస్పిటల్స్ వైద్య బృందానికి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు

విశాలాంధ్ర - కోడుమూరు: మండలంలోని వర్కూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు,సాటి విద్యార్థులు విజేతలను అభినందించారు. ఇటీవల నిర్వహించిన జిల్లా,రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని విద్యార్థులు మొదటి, రెండవ స్థానాలు సాధించడం వారి పట్టుదల, కృషికి నిదర్శనమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వీన్ భాను తెలిపారు.రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ అండర్-14 విభాగంలో చిన్న శ్రీకాంత్ రెండో స్థానం,సుచిత్ర నాలుగో స్థానం సాధించగా, రాష్ట్రస్థాయి బాక్సింగ్ అండర్-19 విభాగంలో అరుణ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ అండర్-19 విభాగంలో పల్లవి, రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో హర్షవర్ధన్ ఉత్తమ ప్రతిభ చూపారని పాఠశాల పీడీ రసూల్ బి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, శివన్న, రమణమూర్తి, శ్రీనివాసులు, రాజశేఖర్, గోపాలు, ఇందిరా పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ హాస్టల్స్ వింగ్ కన్వీనర్ ఆవుల పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఈ నెల 19, 20,21 తేదీలలో ఒంగోలులో జరిగిన ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలలో పత్తికొండ కు చెందిన ఆవుల పవన్ కళ్యాణ్ ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

అభివృద్ధికి అడ్డుపడకండి

విశాలాంధ్ర - వెల్దుర్తి: అభివృద్ధికి అడ్డుపడకండి, సహకరించాలని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి ఎల్ఈ జ్ఞానేశ్వర్ గౌడ్ అన్నారు. ఆయన తన స్వగృహంలో సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ కొందరు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షులు సూదేపల్లి జయరాముడు, మాజీ జడ్పీటిసి ఐజయ్య, వడ్డే మల్లికార్జున సిద్దనగట్టు వెంకటేశ్వర్లు, నాయకులు కొత్తూరు క్రిష్ణ, హరి, సురేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

30న ఉత్తర ద్వార దర్శనం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని గుండంపాడు గ్రామంలో పవిత్రమైన వైకుంఠ ఏకాదశి శుభ సందర్భంగా గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్తర ద్వారా దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వైకుంఠ ఏకాదశి పుణ్య దినాన ఉపవాసం ఉండి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శ్రీమహా విష్ణువుకి, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేయడం వల్ల ఆ ఇంట్లో సిరిసంపదలు నెలకొంటాయని, మోక్షం లభిస్తుందని ప్రగాఢ నమ్మకం. విష్ణు భక్తికి ప్రతీక జాగారం అని చెబుతారు. వైకుంఠ ఏకాదశి రోజు రాత్రి శ్రీ వేంకటేశ్వర స్వామి నామ సంకీర్తనలతో, భజనలతో, భాగవత కథలతో ఆధ్యాత్మిక భావనతో జాగరణ చేయడం వల్ల మోక్షం పొందవచ్చు అని శాస్త్రం చెబుతోందన్నారు. ఈ నేపథ్యంలో వైకుంఠ ఏకాదశి 2025 డిసెంబర్ 30వ తేదీన ఆలయంలో ఉత్తర ద్వారం నుండి స్వాముల వారి దర్శన భాగ్యం కల్పించనున్నట్లు గుండంపాడు గ్రామస్తులు తెలిపారు. డిసెంబర్ 29 జాగరణ సందర్భంగా ఆధ్యాత్మిక సంకీర్తనలతో హరీ నామ భజనలతో జాగరణ ఉంటుందన్నారు. అనంతరం తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు విగాథం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అలగడ్డ డిఎస్‌పి కె.ప్రమోద్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అంతకుముందు సిఐ రమేష్ బాబుతో కలిసి స్టేషన్ పరిసర ప్రాంతం పరిసిలించి, వివిధ కేసులో స్వాధీనం చేసుకున్న వాహనాలపై ఆరా తీశారు. స్థానిక పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి ఆయా కేసుల నమోదు, విచారణ, నిందితులపై చర్యలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తదితర వాటిపై ఆరా తీశారు. బాధితులకు భరోసా కల్పించేలా శాంతి భద్రతల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని డిఎస్పి తెలిపారు. ఎలాంటి సమస్యలు గ్రామాలలో తలెత్తిన పోలీసులకు సమాచారం అందించి ప్రజలకు సహకరించాలన్నారు. వీరి వెంట ఏఎస్ఐ బాబా పక్రుద్దీన్ తదితరులు ఉన్నారు.

రూరల్ సీఐగా బీవీ రమణ బాధ్యతలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బీవీ రమణ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని, ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టంగా అమలు చేస్తామని చెప్పారు. యువ తకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ, తప్పుదారులు పట్టకుండా సాను కూల దిశగా నడిపించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి స్పంది ంచి మెరుగైన పోలీసు సేవలు అందిస్తానని సీఐ బీవీ రమణ హామీ ఇచ్చారు.

బాల్యవివాహాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: బాల్యవివాహాలు సమాజానికి శాపమని, ఇవి పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదముందని కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ కారిడార్ లో బాల్య వివాహాల నిర్మూలనపై వందరోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, సామాజిక అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటాయని, చట్టప్రకారం 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలులకు వివాహం చేయడం నేరమని స్పష్టం చేశారు. బాల్య వివాహాల నివారణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపు నిచ్చారు. బాల్యవివాహాల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా సంబంధిత అధికారులకు తెలపాలని కోరారు.

బాల్య వివాహాల అవగాహన సదస్సు

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో స్థానిక కిందిగేరిలో అంగన్వాడీ టీచర్లుతో బాల్య వివాహాలతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సూపర్ వైజర్ సుచరిత్ర మాట్లాడుతూ గ్రామల్లో చిన్న పిల్లలకు బాల్య వివాహాల చేస్తే అధికారుల దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. బాల్య వివాహాలు చేసుకుంటే ఆరోగ్యం పరంగా తీవ్ర ఇబ్బందులు పడుతారని సూచించారు. బాల్య వివాహాలు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 18 ఏళు నిండిన బాలికలకు మాత్రమే వివాహాలు చేయాలి అని సూచించారు. లేదంటే బాలికల తల్లిదండ్రులు శిక్షా అర్హులు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బి.గీతా పుష్పవతి, జైతున్ బీ, శివమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఆధునిక గణిత మేధావి రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : గణిత శాస్త్రంలో కొత్త సూత్రాలను కనుగొన్న ఆధునిక ప్రపంచ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని మండల విద్యాధికారి అబ్దుల్ కలాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నందు ఎస్ ఓ లక్ష్మీ సరోజ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి అబ్దుల్ కలాం విద్యార్థినీలు మాథ్స్ ప్రయోగాలను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తి గా తీసుకొని రాణించాలన్నారు. గణిత శాస్త్రంలో సూత్రాలను కనుగొన్న అపూర్వ మేధావి రామానుజన్ అని ఆధునిక గణిత మేధావిగా పేరుగాంచారన్నారు. విద్యార్థులు మూఢనమ్మకాలను పారదోలేలా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు.

గణితం అంటే భయం వీడాలి

విశాలాంధ్ర-అవుకు: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు గణితం అంటే భయం వీడాలి అప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చు అని మండల విద్యాధికారి-2 వెంకటేశ్వర రెడ్డి అన్నారు. పట్టణంలోని మదర్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు కరస్పాండెంట్ ముచ్చలపురి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత దినోత్సవ వేడుకలకు మండల విద్యాధికారి-2 వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఆవరణంలో విద్యార్థులు ఏర్పాటుచేసిన గణితానికి సంబంధించిన స్టాల్స్‌ను తిలకించారు. గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కరస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రామ సుబ్బమ్మ, ప్రిన్సిపల్ మల్లిక, ప్రధానోపాధ్యాయుడు రాయసం మురళీమోహన్ పాల్గొన్నారు.

భావితరాలకు ఫ్యాషన్ అందించేందుకే దిగ్గజాల కలయిక

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : ఫ్యాషన్‌లో సరికొత్త ఒరవడిని సృష్టిస్తూ.. భావితరాలకు మరింత చేరువ చేసేందుకే ఎఫ్డిసిఐ బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ తో సహకారంపై ఆనందంగా ఉందని, లాంటి సహ కారం ద్వారా ఫ్యాషన్ రెండు శక్తివంతమైన దిగ్గజాలు ఏకం చేసి భవిష్యత్తును రూపొందిస్తు దని ఎఫ్డిసిఐ చైర్మన్ సునీల్ సేథి తన అభిప్రాయం వ్యక్తం చేశారు. కోల్ కత్తా ఎడిషన్ సృజనాత్మకత, సంస్కృతిలను సంబరం చేసిందని, దేశపు ఫ్యాషన్ లో భవిష్యత్తు ట్రెండ్ కోసం మార్గాన్ని సుగమం చేసిందన్నారు. ఈ ప్రదర్శనకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన ఇషాన్ ఖట్టర్ మాట్లాడుతూ బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ లో భాగం కావడం అనేది ప్రయోగాలు చేయాలని, వాటికి మించి ముందుకు కొనసాగా లని నా సొంత సహజమైన ధోరణికి పూర్తిగా అనుగుణంగా ఉందని భావించినట్లు తెలిపారు. హుగ్లీ నది మధ్యలో లంగరు వేసిన పడవపై ప్రదర్శన చేపట్టి, ఫ్యాషన్ తెలియాడే థియేటర్‌గా మార్చిన ఘనత బ్లెండర్స్ ప్రైడ్‌కే దక్కిందన్నారు. డైవర్స్ పడవలోకి రావడం.. కాంతి, పొగ శబ్దాలు సజీవంగా మారడంతో ప్రారంభం కాగా, ఇషాన్ వేగవంతమైన పడవలో రావడంతో నాటకీయమైన ఉన్నతమైన స్థాయిని ముగింపు అందించింది అని చెప్పారు. ఇది దిగ్గజకు హౌరా వంతెనకు ఎదురుగా ఏర్పాటు చేయబడిన సామూహిక ముగింపు క్షణంతో ముగిసిందని తెలపడానికి తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

భవిష్యత్తుకు మార్గదర్శి గణితం

విశాలాంధ్ర - కౌతాళం: స్థానిక ప్రతిభ హై స్కూల్ నందు జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి రామాంజ నేయులు, పాఠశాల యాజమాన్యం గణిత శాస్త్రవేత్త రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మన భవిష్యత్తుకు గణితం ఒక మార్గదర్శి అని, విద్యార్థినీ విద్యార్థులు గణిత శాస్త్రాన్ని చాలా సులువుగా అభ్యసించవచ్చని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు విద్యార్థులకు ఉద్దేశించి దాదాపుగా 80 రోజుల్లో పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ 80 రోజుల్లో ఆటంకం కలిగించే నటువంటి సెల్ ఫోన్లు, టీవీలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, మంచి మార్కులు సాధించగలరని సూచించారు. గణిత శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు చేసిన నమూనాలను చూసి వాటి గురించి అడిగి తెలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ దూద్ భాష, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, గణిత ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు జయలక్ష్మి, రామలక్ష్మి, భీమేష్, శ్రీను, ఈరన్న ఉపాధ్యాయులు ఈరన్న, శిరీష, ముంతాజ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన వంద రోజుల ప్రణాళిక

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ప్రభుత్వ ఆదేశాలను పట్టిష్టంగా అమలు చేస్తూ ప్రతి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ప్రయోజకులుగా చేయాలన్న లక్ష్యంతో ఉపాధ్యాయులు ఎంతో శ్రమతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్న తరుణంలో ఉపాధ్యాయులపై 100 రోజుల పని దినాల ప్రణాళిక శాపంగా మారిందని ఎస్టియు జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు విమర్శించారు. సోమవారం ఎస్టియు భవన్‌లో ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి ఎస్టియు ఆదోని మండల ప్రధాన కార్యదర్శి చింతకుంట రామకృష్ణ అధ్యక్షత వహించడం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి అయన మాట్లాడుతూ ఇటీవల విడుదల చేసిన పదవ తరగతి ఉత్తమ ఫలితాల కోసం వందరోజుల ప్రణాళిక ఉపాధ్యాయులు పాలిట శాపంగా మారిందని ఆగ్రహ వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సెలవుల్లో పని చేయాలని, పదవ తరగతి బోధించే ఉపాధ్యాయులకు ఎలాంటి సెలవులు మంజూరు చేయకూడదని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే ఉపాధ్యాయులకు వంద రోజులు ప్రణాళిక నుండి విముక్తికల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర కౌన్సిలర్ మనపాటి సూర్యుడు మాట్లాడుతూ వందరోజుల ప్రణాళికలో భాగంగా ఇతర డిపార్ట్మెంట్లలో అధికారులను ఇన్చార్జిలుగా నియమించటం సబబు కాదన్నారు. నియమించిన ఇన్చార్జిలను రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆదోని మండల అధ్యక్షుడు కే.లక్ష్మన్న,సీనియర్ నాయకులు బి.సత్యన్న, నాయకులు ఆర్బి వెంకటేశ్వర్లు, ప్రభన్న, గణేష్, నందీశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీహార్ సీఎం నితీష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర -ఆదోని : హిజ్ ఆఫ్ ధరించి డాక్టరేట్ పొందుతున్న యువ డాక్టర్‌పై అనుచితంగా బాధ్యతారహితంగా ప్రవర్తించిన బీహార్ సీఎం నితీష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఆదోని రాజకీయ సంయుక్త కార్యచరణ కమిటీ సభ్యులు గౌస్ ఖాన్, అబూ బక్కర్ సిద్దిక్, సాదుల్లా డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని ఇంచార్జ్ సబ్ కలెక్టరుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం అంటేనే విభిన్న కులాల కలయికతో ఉన్న ప్రజాస్వామ్య దేశంలో లౌకిక విలువలకు భంగం కలిగించే విధంగా ముఖ్యమంత్రి హోదాలో నితీష్ కుమార్ వ్యవహార శైలి రాజ్యాంగ విలువలకు తూట్లు పొడిచారని విమర్శించారు. ముస్లిం మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన సీఎం నితీష్ కుమార్ అంశాన్ని రాష్ట్రపతి, ప్రధానమంత్రి, బీహార్ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆదోని సబ్ కలెక్టర్కు వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ఉన్నత స్థాయి హోదాలో ఉన్న వ్యక్తి మహిళల గౌరవాన్ని, హక్కులను, మతసేచ్ఛను కాపాడకుండగా అధికారం ఉందన్న ధీమాతో ప్రవర్తించిన తీరుపై యావత్ భారతదేశం అంతటా విమర్శలు వస్తున్నాయని వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని రాజకీయ సంయుక్త కార్యచరణ కమిటీ నాయకులు ఫారుక్ భాష, ఫయాజ్ భాష, సద్దాం హుస్సేన్, జునేద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లా సాధనకు ఉద్యమం ఉధృతం

విశాలాంధ్ర -ఆలూరు: ఆదోని జిల్లాను ఏర్పాటు చేయాలనే డిమాండ్ తో కొనసాగుతున్న ఉద్యమం రోజురోజుకూ మరింత ఉధృతంగా మారుతోంది. ఈ క్రమంలో 11వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలకు ఆలూరు డివిజన్ అగ్రి ఇన్‌పుట్స్ డీలర్ అసోసియేషన్, ఆదోని డివిజన్ అగ్రి ఇన్‌పుట్స్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. సోమవారం ఆలూరులో నిర్వహించిన దీక్షా శిబిరానికి పెద్ద సంఖ్యలో అగ్రి ఇన్‌పుట్స్ డీలర్లు, ఉద్యోగులు చేరుకుని దీక్షలో పాల్గొన్నారు. ఆదోని జిల్లా ఏర్పాటు అయ్యే వరకు ఉద్యమానికి అండగా నిలుస్తామని, అవసరమైతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు భూపేష్ కత్తి రామాంజనేయులు మాట్లాడుతూ, ఆదోని ప్రాంతం చరిత్రాత్మకంగా, భౌగోళికంగా, పరిపాలనా పరంగా ప్రత్యేక జిల్లాకు అన్ని అర్హతలు కలిగి ఉందని పేర్కొన్నారు. విస్తారమైన వ్యవసాయ భూములు, వ్యాపార కేంద్రంగా ఆదోని ప్రాధాన్యం, ప్రజల సౌకర్యాల దృష్ట్యా జిల్లా ఏర్పాటు అత్యవసరమని వారు డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షలను పక్కనపెట్టి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆదోని జిల్లా ఏర్పాటు జరిగే వరకు ఈ రిలే నిరాహార దీక్షలు, మద్దతు కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు పూల రామాంజనేయులు గుళ్యం ఎల్లప్ప, అగ్రి ఇన్పుట్స్ అసోసియేషన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సుంకులమ్మ, కర్రెమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా సుంకులమ్మ, కర్రెమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు తెలుపుతూ ఐదు సంవత్సరాలకు ఒకసారి గ్రామంలో సుంకులమ్మ, కర్రెమ్మ జాతర నిర్వహిస్తామని వారన్నారు. సోమవారం ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, కుంకుమార్చన, మహనిరాజనం, మహా నైవేద్యాలు, మంగళహారతి తీర్థ ప్రసాద వియోగం, సాయంకాలం కుశల అన్న గురువు సమక్షంలో చెక్కభజన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు, రాత్రికి పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 5 గంటల లోపు మహాకాళి, మహా సరస్వతి, రూప సరస్వతి, అస్య శ్రీమాతా సుంకులమ్మ, కర్రమ్మ దేవతలకు బోనాల సమర్పణ ఉంటుందన్నారు. గ్రామంలో బంధువులు ఆడబిడ్డలు భక్తులు కలిసి పండగ చేసుకుని అంగరంగ వైభవంగా సంబరాలు చేసుకుంటారన్నారు. గ్రామమంతా గాజుల, స్వీటు అంగళ్లతో మరియు రంగురాటాలతో నిండిపోయిందన్నారు. ఈ జాతరలో ఎలాంటి వాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వెల్దుర్తి సీఐ యుగంధర్, ఎస్సై కృష్ణమూర్తి ఆధ్వర్యంలో క్రిష్ణగిరి పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారన్నారు.

క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తా

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : క్రమశిక్షణ గల టిడిపి కార్యకర్తగా పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తానని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుస్సేన్ తెలిపారు. కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి ఎంపిక ప్రక్రియలో చోటుచేసుకున్న పరిణామాలపై సోమవారం అయన స్పందించారు. దాదాపుగా ఖరారైన జాబితాలో పేరు ఉండి, తుది జాబితాలో మార్పులు జరగడంపై సహజంగానే కొంత బాధ కలిగినప్పటికీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. క్రమశిక్షణే తెలుగుదేశం పార్టీకి బలమని, అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూ, భవిష్యత్తులోనూ అదే ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి పని చేస్తానని వివరించారు. జిల్లా అధ్యక్ష పదవి దక్కలేదని నిరాశ చెందకుండా, రెట్టింపు స్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యకర్తల విశ్వాసాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని, అభిమానులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, పార్టీ గెలుపే పరమావధిగా అందరం ముందుకు సాగుదామని ఆయన ఒక ప్రకటలో పేర్కొన్నారు.

యాగంటి ఉమామహేశ్వరులకు పల్లకి సేవ

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామి ఆలయం లో సోమవారం స్వామివారి పల్లకీ సేవ ఘనంగా నిరహించారు. ఆలయంలో కొలువైన ఉమామహేశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువు దీర్చి పల్లకీ సేవ చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.పాండురంగారెడ్డి, యాగంటి పల్లె మౌళీశ్వర రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితులు అరెస్టు

విశాలాంధ్ర - కోడుమూరు: మండల పరిధిలోని గోరంట్ల, ముడుమలగుర్తి గ్రామాల్లో ఇటీవల జరిగిన దొంగతనాల కేసులను పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో కురువ నాగేంద్ర ముద్దాయిగా గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్ఐ డివై.స్వామి తెలిపారు. ఎస్ఐ డివై స్వామి తెలిపిన వివరాల ప్రకారం ముడుమలగుర్తి గ్రామానికి చెందిన కురువ నాగేంద్ర, గోరంట్ల గ్రామానికి చెందిన బోయ ఎల్లప్ప ఇటీవల పరిచయం ఏర్పడిన తర్వాత జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో తాళాలు వేసిన ఇళ్లపై నిఘా పెట్టి రెక్కీ నిర్వహిస్తూ దొంగతనాలకు పాల్పడ్డారు. నవంబర్ 27న గోరంట్ల గ్రామానికి చెందిన రాము ఇంట్లో దొంగతనం చేయడంతో పాటు, ముడుమలగుర్తి గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి ఇంట్లో మరో చోరీ చేశారు. ఈ రెండు కేసుల దర్యాప్తులో భాగంగా కురువ నాగేంద్రను ఈ నెల 21న ఆదివారం కోడుమూరు పట్టణంలోని తాత గుడి వద్ద పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ముద్దాయి వద్ద నుంచి రెండు జతల బంగారు కమ్మలు, ఒక బంగారు చైన్, ఒక జత వెండి కాళ్ల పట్టీలు, నగదు రూ.80 వేలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గోరంట్ల గ్రామంలో జరిగిన మరో చోరీ కేసుకు సంబంధించి ఒక బంగారు తాళిబొట్టు చైన్, ఒక జత బంగారు బుట్ట కమ్మలు,ఒక జత వెండి కాళ్ల పట్టీలు, ఒక వెండి ముల్లతాడును రికవరీ చేసినట్లు వివరించారు. ఈ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తి విలువ సుమారు రూ.6,13,000గా అంచనా వేసినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం కర్నూలులోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ బాబుప్రసాద్ సమక్షంలో సీఐ ఎండి తబ్రేజ్‌తో కలిసి ముద్దాయి కురువ నాగేంద్రను హాజరుపరిచినట్లు ఎస్ఐ అన్నారు. మరో నిందితుడు బోయ ఎల్లప్ప పరారీలో ఉన్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ డివై స్వామి సూచించారు.

గ్రామ పంచాయతీల బలోపేతం కృషి

విశాలాంధ్ర - వెలుగోడు: గ్రామ పంచాయతీల బలోపేతం కొరకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. వెలుగోడు పట్టణం లోని సచివాలయం 2 వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 15 వ ఆర్థిక సంఘము నిధులు రూ.22 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ ను సోమవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పూజ చేసి ప్రారంభించారు. కాంప్లెక్స్ గదులను సర్పంచ్ జైపాల్, ఎంపిడిఓ మధుసూదన రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, గ్రామ కార్యనిర్వాహన అధికారి నరేంద్ర, టిడిపి నాయకులు శేషిరెడ్డి, అబ్దుల్ కలాం ప్రారంభించారు. తర్వాత ఉర్దూ స్కూల్ వద్ద నిర్మించిన సిమెంట్ రోడ్డు ను ఎమ్మెల్యే ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన రైతు బజారు ఉపయోగం లేకుండ వృధాగా ఉండడాన్ని చూసి కూరగాయల యాజమాన్యం వారికీ ఉచితంగా నైనా ఇచ్చి ఉపయోగం లోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు మాజీ ఎంపిపి ఎల్లాల కృష్ణుడు, రఘునాథ రెడ్డి, రఘుస్వామి రెడ్డి, దా జాకీర్, మోమిన్ రసూల్, విరభద్రుడు, ఖలీల్, వెంకటరమణ, సూర్యనారాయణ, బలుసా రాము, సంజీవరాయ ప్రసాద్, జాకటి చంద్ర, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గౌరు చరితరెడ్డికి అభినందనలు తెలిపిన నాయకులు

విశాలాంధ్ర - ఓర్వకల్లు : టీడీపీ అధ్యక్షురాలుగా ఎన్నికైన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి నన్నూరు విశ్వేశ్వర రెడ్డి టీడీపీ అధ్యక్షులు డి.నాగిరెడ్డి, పాణ్యం బీసీ సెల్ తలారి విజేయుడు జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షులు ఖాజామియ్య మాజీ కో అప్షన్ సభ్యులు షంశుద్దీన్ క్రిష్ణారెడ్డి శ్రీపతి, రాంభూపాల్ రెడ్డి తులశిధర్ రెడ్డి, పట్టేలా మోహన్, మొల్ల మాబు, ఎమ్మెల్యే స్వగృహం నందు కలిసి పూల గుచ్ఛలతో ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.